

స్పందన అర్జీలపై అవగాహన కల్పించాలి

ప్రజాశక్తి - రాజమహేంద్రవరం


స్పందన అర్జీలపై క్షేత్ర స్థాయిలో ప్రజలకు అధికారులు అవగాహన కల్పించాలని కలెక్టర్ డాక్టర్ కె.మాధవీలత ఆదివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. సోమవారం కలెక్టరేట్‌లో జిల్లా స్థాయి స్పందన జరగుతుందన్నారు.కలెక్టర్, జాయింట్ కలెక్టర్, జిల్లా అధికారులు, డివిజన్, మండల స్థాయి అధికారులు క్షేత్ర స్థాయి కార్యాలయాల్లో, సచివాలయాల్లో అర్జీలు స్వీకరిస్తారన్నారు. మండల స్థాయిలో జరిగే స్పందనను జూమ్ కాన్ఫరెన్స్ ద్వారా పరిశీలిస్తామనఆనరు. అన్ని మండలాల్లో, సచివాలయాల్లో యథ్యావిధిగా స్పందనను నిర్వహించాలని ఆదేశించారు. ప్రజల నుంచి అర్జీలను ఉదయం 10 నుంచి 1 గంట వరకు స్వీకరిస్తామన్నారు.

అనుకున్నదొక్కటి...

నిర్వేదంలో స్థానిక సంస్థల ప్రతినిధులు
కార్పొరేషన్ చైర్మన్లు, డైరెక్టర్లదీ అదే పరిస్థితి
అధికార పార్టీలో రగులుతున్న అసంతృప్తులు

ప్రజాశక్తి- రాజమహేంద్రవరం ప్రతినిధి

వైసిపి ప్రభుత్వంపై క్రమంగా అసంతృప్తి పెరుగుతోంది. జిల్లాకు ఒక్క శాశ్వత ప్రాజెక్ట్ అయినా ప్రారంభానికి నోచుకోకపోవడంపై ప్రజలు పెదవి విరుస్తున్నారు. మూడున్నర ఏళ్ల పాలనలో జిల్లాకు ఒకటి లేదా రెండు పరిశ్రమల తప్ప ఆశించిన స్థాయిలో ఏర్పాటు కాలేదు. ప్రత్యేక ప్రాజెక్టులేవీ లేవు. రహదారుల పరిస్థితి దారుణంగా మారింది. పంచాయతీల్లో పారిశుధ్య పనులు లేవు. చిన్న సమస్య పరిష్కారానికైనా నిధుల కొరత వెంటాడుతోంది. ఉపాధి బిల్లులు సకాలంలో చెల్లించడం లేదు. సచివాలయ వ్యవస్థ ప్రారంభించి రెండేళ్లు అవుతున్నా సేవలు మెరుగుపడడం లేదు. ప్రతివారం నిర్వహిస్తున్న స్పందన కార్యక్రమానికి అర్జీల సంఖ్య నానాటికి పెరుగుతుందే తప్ప సంఖ్యాపరంగా తగ్గడం లేదు. కొత్త భవనాల నిర్మాణాలు కొనసా...గుతూనే ఉన్నాయి. రైతుభరోసా కేంద్రాలు ఆశించిన స్థాయిలో ఫలితమివ్వలేదు. రైతులు ఎప్పటిలానే ప్రారంభంలో యూరియాకు, దిగుబడిల అనంతరం విక్రయాలకు అవస్థలు పడుతూనే ఉన్నారు. ప్రజా ప్రతినిధులు ఆర్భాటంగా ప్రచారం చేస్తున్న జగనన్న కాలనీల లబ్ధిదారులు సైతం పెదవిరుస్తున్నారు. ఇలా అన్నింటా ప్రభుత్వ వైఫల్యాలు ఒక్కొక్కటిగా కనిపిస్తున్నాయి.



అంతర్మథనంలో ద్వితీయశ్రేణి నాయకులు

ప్రభుత్వ తీరుపై ద్వితీయ శ్రేణుల్లో సైతం అంతర్మథనం ప్రారంభమైంది. పార్టీ కోసం శ్రమిస్తే అందుకు తగ్గట్టు ప్రతిఫలం లేదని వారు నిట్టూరుస్తున్నారు. కొద్దిమందికి నామినేటెడ్ పదవులు దక్కినా.. వాటితో వారు కాలక్షేపం చేస్తున్నారు తప్ప ఎటువంటి విధులు, నిధులు లేవు. స్థానిక సంస్థల ఎన్నికల్లో చేసిన అప్పులే మిగిలాయని సర్పంచ్‌లు బహిరంగంగానే వాపోతున్నారు. కేంద్రం అందించే ఆర్థిక సంఘం నిధులు సైతం మళ్లిస్తుండడంపై వారు తీవ్ర ఆగ్రహంతో ఉన్నారు. మండల స్థాయిలో పార్టీ గెలుపునకు కష్టించి పనిచేసిన ద్వితీయ శ్రేణి నాయకత్వం ఇప్పుడు గందరగోళంలో పడింది. పేరుకే అధికార పార్టీ కానీ..తమ పరిస్థితి దయనీయంగా మారిందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. నేతలకు నామినేటెడ్ పద్ధతిపై ఇచ్చే పనులు ఎక్కడా కనిపించడం లేదు. కేంద్రం నుంచి వచ్చిన నిధులకు మ్యాచింగ్ చేసి పనులు కూడా చేయడం లేదు. కేవలం సంక్షేమ పథకాలపైనే ప్రభుత్వం దృష్టిపెడితే తమ పరిస్థితి ఏమిటని వారు పెదవివిరుస్తున్నారు.

పనులు చేసేందుకు వెనుకడుగు

మండలాల్లో ప్రభుత్వపరంగా పనులు చేయడానికి నేతలు భయపడుతున్నారు. ఒక వేళ చేసినా బిల్లులు ఎప్పుడు వస్తాయో కూడా తెలియడం లేదు. అధికారులు కూడా స్పష్టత ఇవ్వడం లేదు. రైతు భరోసా కేంద్రాలు, సచివాలయాలు, హెల్త్ క్లినిక్‌ల నిర్మాణాలు జరుగుతున్నాయి. వీటి పనులు చేస్తున్న ద్వితీయ శ్రేణి నాయకులు బిల్లులు రాక అప్పుల ఊబిలో మునిగిపోతున్నారు. ఎప్పుడు బిల్లులు వస్తాయోనని ఆశగా ఎదురు చూస్తున్నారు. కొత్తగా ఎన్నికైన కౌన్సిలర్లు, సర్పంచ్‌లు, ఎంపిటిసి సభ్యులు ఆదాయాల కోసం ప్రయత్నిస్తున్నారు. ఎంఎల్‌ఎలు, నియోజకవర్గ ఇన్‌ఛార్జుల దృష్టిలో పడేందుకు పాట్లు పడుతున్నారు. ప్రభుత్వం మాత్రం నవరత్నాల పేరిట సంక్షేమానికే ప్రాధాన్యం ఇస్తోందని, తమ క్యాడర్‌కు మాత్రం ఏదీ దక్కలేదనే అసంతృప్తి వ్యక్తమవుతోంది.

నిధులు లేని పదవులు

రాష్ట్ర స్థాయిలో వివిధ కార్పొరేషన్లకు సంబంధించి జిల్లాకు పదవులు దక్కాయి. చైర్మన్లతో పాటు డైరెక్టర్ పదవులు పదుల సంఖ్యలో దక్కించుకున్న నాయకులు నిధులు లేక నిట్టూరుస్తున్నారు. గతంలో వివిధ కులాల కార్పొరేషన్లు, ఆర్థిక సంస్థలకు ప్రత్యేక బడ్జెట్ కేటాయించేవారు. ఆ కార్పొరేషన్లు ప్రత్యేకంగా ఆ వర్గాలకు చెందిన వారికోసం కార్యక్రమాలు అమలు చేసేవి. ఫలితంగా కొంత మేలు జరిగేది. వైసిపి అధికారంలోకొచ్చాక పరిస్థితులు పూర్తిగా తలకిందులయ్యాయి. కార్పొరేషన్లను వాటిని రాజకీయ పునరావాస కేంద్రాలుగా మాత్రమే మార్చేశారు. కొంతమందికి కార్యాలయాలు కూడా కేటాయించిన పరిస్థితి నెలకొంది. ఇక కార్యకలాపాల సంగతి సరేసరే. మొత్తం మీద క్రమక్రమంగా అసంతృప్తి వ్యక్తం అవుతుంది.



విగ్రహాన్ని ఆవిష్కరిస్తున్న ఎంపీ భరత్, మంత్రి వనిత, ఎంఎల్‌ఎ రాజా

కవయిత్రి మొల్ల ఆదర్శనీయురాలు

కాంస్య విగ్రహాన్ని ఆవిష్కరించిన హోం మంత్రి వనిత

ప్రజాశక్తి - రాజమహేంద్రవరం

మహిళా లోకానికి కవయిత్రి మొల్ల ఆదర్శనీయురాలని హోం మంత్రి తానేటి వనిత అన్నారు. నగరంలో గౌతమి ఘాట్ వాకర్స్, యోగ వెల్ఫేర్ అసోసియేషన్ ప్రాంగణంలో మొల్ల కాంస్య విగ్రహాన్ని ఏర్పాటు చేశారు. వైసిపి జిల్లా అధ్యక్షులు, రాజానగరం ఎంఎల్‌ఎ జక్కంపూడి రాజా ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో మంత్రి వనిత, ఎంపీ మార్గాని భరత్ పాల్గొన్నారు. మంత్రి వనిత జ్యోతి ప్రజ్వలన చేసి, కాంస్య విగ్రహాన్ని ఆవిష్కరించారు. మహా కవయిత్రి మొల్ల కాంస్య విగ్రహాన్ని నెలకొల్పిన కమిటీ సభ్యులను మంత్రి వనిత అభినందించారు. ఈ సందర్భంగా ఎంపీ భరత్‌రామ్ మాట్లాడుతూ సాహిత్యానికి పెట్టింది పేరైన రాజమహేంద్రవరం గోదారమ్మ శిగలో మరో ఆణిముత్యం చేరిందని, అదే తొలి తెలుగు కవయిత్రి ఆతుకూరి మొల్ల విగ్రహం అన్నారు. సంస్కృతంలో వాల్మీకి రచించిన శ్రీమద్రామయణాన్ని ఆధారంగా చేసుకొని తేట తెలుగులో పద్య కావ్యంలో మొల్ల రచించారని, ఆ కావ్యమే మొల్ల రామాయణంగా ప్రసిద్ధి చెందిందన్నారు. కంద పద్యాలు ఎక్కువగా ఉండటం వల్ల కంద రామాయణం అని కూడా అంటారని చెప్పారు. కేవలం అయిదు రోజుల్లో ఈ కావ్యాన్ని రాసినట్టు చెబుతారని, మొల్ల రచన వాడుక భాషకు దగ్గరగా ఉండటం వల్ల ప్రజలకు అత్యంత చేరువైన కావ్యం మొల్ల రామాయణం అని ఎంపీ భరత్ వివరించారు. 16వ శతాబ్దానికి చెందిన మొల్ల కవితలల్లిన తొలి తెలుగు విదుషీమణిగా వినుతికెక్కారని, అటువంటి మహా కవయిత్రి మొల్ల విగ్రహం రాజమండ్రిలో నెలకొల్పడం చాలా సంతోషమని అన్నారు. మొల్ల విగ్రహాన్ని ఏర్పాటు చేసిన కమిటీ సభ్యులను ఈ సందర్భంగా ఎంపీ భరత్ అభినందించారు.

ఎంఎల్‌ఎ రాజా మాట్లాడుతూ చారిత్రక ప్రాశస్త్యం కలిగిన రాజమహేంద్రవరం నగరం కవులు, కవయిత్రులకు కేంద్రమన్నారు. అలాంటి సారస్వత కేంద్రంలో పవిత్ర గోదావరి తీరాన మొల్ల విగ్రహాన్ని ఆవిష్కరించుకోవడం హర్షణీయమన్నారు. ఎంత ఎదిగినా ఒదిగివుండాలనే లక్షణం కవయిత్రి మొల్లలో మెండుగా ఉండేదని, తనకు శాస్త్రీయమైన కవిత్వజ్ఞానం లేదని, భగవత్ వరప్రసాదం వల్లే కవిత్వం చెప్పగలుగుతున్నానని చెప్పడం ఆమెలోని గొప్పతనానికి నిదర్శనమని రాజా పేర్కొన్నారు.

ఈ కార్యక్రమంలో విగ్రహావిష్కరణ కమిటీ ఛైర్మన్ రాయపూడి శ్రీనివాసరావు, కో-ఛైర్మన్ మెరుగుపల్లి సత్యనారాయణ, పేరూరి గంగాధరం, కన్వీనర్ కాలేశ్వరరావు, ఎల్లా అప్పారావు ఉడయార్, పసలపూడి భద్రయ్య తదితరులు పాల్గొన్నారు.

పూర్వ విద్యార్థుల ఔదార్యం

ప్రజాశక్తి-కడియం

కడియం ఉన్నత పాఠశాలలో 1986-87లో పదోతరగతి చదివిన పూర్వ విద్యార్థి బి.సత్యమూర్తి ఇటీవల మృతి చెందాడు. తనతో పాటు చదువుకున్న మిత్రులు ఈ విషయం తెలుసుకున్నారు. ఆ కుటుంబానికి తమ వంతు సాయం చేయాలని నిర్ణయించారు. దీనితో మిత్రుల సహకారంతో చదువుకున్న పాఠశాల ఆవరణలో ఆదివారం సత్యమూర్తి కుటుంబ సభ్యులకు రూ.25 వేల ఆర్థిక సాయం అందించారు. పూర్వ విద్యార్థులు సేవా గుణాన్ని సత్యమూర్తి కుటుంబ సభ్యులతో పాటు పలువురు అభినందించారు. ఈ కార్యక్రమంలో పూర్వ విద్యార్థులు దిగ్గిరెడ్డి శ్రీనివాస్ , ఉంగరాల వీరభద్రరావు , జంగాల సత్యనారాయణ, చిక్కాల ఏడుకొండలు, పరిమి నరేష్, తదితరులు ఉన్నారు.



స్నేహితుని కుటుంబానికి ఆర్థిక సాయం అందిస్తున్న పూర్వ విద్యార్థులు



వైద్యపరీక్షలు చేస్తున్న వైద్యులు

అంధత్వ నివారణకు లయన్స్ కృషి

ప్రజాశక్తి - కొవ్వూరు రూరల్

అంధత్వ నివారణకు లయన్స్ క్లబ్ కృషి చేస్తుందని కొవ్వూరు లయన్స్ క్లబ్ అధ్యక్షులు కంటమని రామ్‌కిషోర్ అన్నారు. ఆరికరేవుల మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో ఆదివారం లయన్స్ క్లబ్ ఆధ్వర్యలో కంటి వైద్య శిబిరాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా రామ్‌కిషోర్ మాట్లాడుతూ ఈ శిబిరంలో వైద్య పరీక్షలు చేసి అవసరమైన వారికి ఉచితంగా కళ్లజోళ్లను పంపిణీ చేశామన్నారు. శుక్లాల సమస్యతో బాధపడుతున్న వారికి ఉచితంగా ఆపరేషన్లను చేయిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో కొవ్వూరు లయన్స్ క్లబ్ పూర్వ అధ్యక్షులు యనమదల సుబ్రహ్మణ్యం, బూరుగుపల్లి వెంకటేశ్వరరావు, గోలి వెంకటరత్నం, జాయింట్ సెక్రటరీ పెనుమాక జయరాజు పాల్గొన్నారు.

మృతదేహం వెలికి తీత

ప్రజాశక్తి - సీతానగరం

మిర్తిపాడులో ఈ నెల 10న బావిలో దూకిన ఆత్మహత్య చేసుకున్న వ్యక్తి మృతదేహాన్ని పోలీసులు ఆదివారం వెలికి తీశారు. మృతుడు రాజానగరం మండలం తొర్రేడుకు చెందిన పల్లి జాన్(23)గా గుర్తించారు. మతదేహం శరీరంపై టీ షర్టు, లోదుస్తులు మాత్రమే ఉన్నాయి. పోలీసులు కుటుంబ సభ్యులకు సమాచారం అందించారు. యువకుని మృతికి గల కారణాలు తెలియాల్సి ఉంది. ఇది ఆత్మహత్యా లేదా హత్యా? అనే కోణంలో దర్యాప్తు చేస్తున్నామని ఎస్ఐ శుభశేఖర్ తెలిపారు.

'వైఎస్ఆర్ జలకళ'ను సద్వినియం చేసుకోవాలి

ప్రజాశక్తి - గోపాలపురం

మెట్ట ప్రాంతాల్లో నీటి వసతులేని సన్న, చిన్నకారు రైతులు వైఎస్ఆర్ జలకళ పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఎంపిపి ఉండవల్లి సత్యనారాయణ సూచించారు. ఆదివారం మండలంలోని గంగోలు గ్రామ పంచాయతీ పరిధిలోని రాంపాలెంలో కలిగొట్ల వెంకటేశ్వరరావు పొలంలో వైఎస్ఆర్ జలకళ ద్వారా ఏర్పాటు చేసే బోరు పనులకు ఆయన భూమి పూజ చేశారు. ఈ సందర్భంగా ఎంపిపి మాట్లాడుతూ మెట్ట ప్రాంతాల్లో నీటి వసతి లేని రైతుల పంట పొలాలు సస్యశ్యామలం చేసేందుకు వైఎస్ఆర్ జలకళ పథకం ఎంతగానో ఉపయోగపడుతుందన్నారు. 2.5 ఎకరాల భూమి కలిగిన రైతులందరూ దరఖాస్తు చేసుకొని ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. రెండున్నర ఎకరాల విస్తీర్ణం లేని రైతులు పక్కా రైతుతో కలిపి దరఖాస్తు చేసుకోవచ్చని తెలిపారు. ఈ అవకాశం రాష్ట్ర ప్రభుత్వం కల్పించిందన్నారు. ఈ కార్యక్రమం ద్వారా సుమారు 150 బోర్లు వెయనున్నట్లు తెలిపారు. సన్న చిన్న కారు రైతులు బోర్లు వేసుకుని బీడు బారిన పొలాలను సస్యశ్యామలం చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో వైసిపి మండల మాజీ అధ్యక్షులు ఎస్‌కె.ఖాదర్‌వలీ, నాయకులు పీతల ప్రసాద్‌బాబు, కాకులపాటి శ్రీను, ఇళ్ల శ్రీరామమూర్తి, ముల్లంగి శ్రీనివాసరెడ్డి, ద్వారకా తిరుమల వెంకటేశ్వర స్వామి పాలకవర్గ బోర్డు మెంబర్ తానింకి గంగరాజు, తదితర నాయకులు, రైతులు పాల్గొన్నారు.



భూమి పూజలో పాల్గొన్న ఎంపిపి, నాయకులు, రైతులు



రక్త దాతలకు జ్ఞాపికలను అందిస్తున్న సర్పంచ్, సిఐ

జేగురుపాడులో రక్తదాన శిబిరం

ప్రజాశక్తి- కడియం

గ్రామానికి చెందిన గణేష్ సేవా సంస్థ ఆధ్వర్యంలో యువత రక్తదాన శిబిరం ఏర్పాటు చేయడం అభినందనీయమని జేగురుపాడు సర్పంచ్ యాదల సతీష్‌చంద్రస్టాలిన్ అన్నారు. మండలంలోని జేగురుపాడులో ఆదివారం గణేష్ సేవా సంస్థ ఆధ్వర్యంలో చిటికెన సతీష్ జయంతి సందర్భంగా నిర్వహించిన శిబిరంలో సంజీవని బ్లడ్ బ్యాంక్ సిబ్బంది పలు యూనిట్ల రక్తాన్ని సేకరించారు. ఈ సందర్భంగా స్టాలిన్ రక్తదాతలను అభినందించి జ్ఞాపికలు, మొక్కలను అందజేశారు. ఈ కార్యక్రమంలో కడియం సిఐ తిలక్, ఎంపిటిసి సభ్యులు ఆకుల సుధాకర్, నాగిరెడ్డి రామకృష్ణ, నాగిరెడ్డి మోహన్, రంకిరెడ్డి వీరకృష్ణ, సాకా కిరణ్ తదితరులు పాల్గొన్నారు.

రావిమెట్లలో 'ఇదేం ఖర్మ మన రాష్ట్రానికి'

ప్రజాశక్తి - నిడదవోలు

నిడదవోలు మండలం రావి మెట్లలో టిడిపి నిడదవోలు నియోజకవర్గం ఇన్‌ఛార్జి బూరుగుపల్లి శేషారావు ఆధ్వర్యంలో ఆదివారం 'ఇదేం ఖర్మ మన రాష్ట్రానికి' కార్యక్రమాన్ని నిర్వహించారు. నాయకులు, కార్యకర్తలతో కలిసి శేషారావు గ్రామంలో ప్రతి ఇంటినీ సందర్శించారు. ప్రస్తుత వైసిపి పరిపాలనలో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యల గురించి అడిగి తెలుసుకున్నారు ఈ సందర్భంగా శేషారావు మాట్లాడుతూ ప్రస్తుత వైసిపి పరిపాలనలో రాష్ట్రం అన్ని రంగాలలోనూ వెనుకబడిపోతుందని ఆవేదన వ్యక్తం చేశారు. అన్ని వర్గాల ప్రజలతో పాటు ప్రభుత్వ ఉద్యోగులు కూడా జీతాలు అందక అనేక ఇబ్బందులకు గురవుతున్నారన్నారు. కాబట్టి ఇటువంటి అరాచక పాలనను అంతమొందించి వచ్చే ఎన్నికల్లో టిడిపిని గెలిపించుకొని చంద్రబాబును ముఖ్యమంత్రిగా చేసుకుందామని పిలుపునిచ్చారు. యువగళం యాత్రను అడ్డుకుందామని వైసిపి ప్రభుత్వం అనేక ప్రయత్నాలు చేస్తున్నా ప్రజల సాయంతో లోకేష్ యాత్రను కొనసాగిస్తున్నారన్నారు. లోకేష్ పాదయాత్రను ఎవరూ ఆపలేరని శేషారావు అన్నారు. ఈ కార్యక్రమంలో టిడిపి మండల అధ్యక్షులు వెలగన సూర్యారావు, సొసైటీ మాజీ అధ్యక్షులు పాలనాటి లీలాభాస్కర్ తదితరులు పాల్గొన్నారు



ప్రజలతో మాట్లాడుతున్న శేషారావు

కొవ్వాడ కాలువ గట్టును రక్షించాలి

ప్రజాశక్తి - గోపాలపురం

కొవ్వాడ ప్రాజెక్ట్ కాలువ నుంచి రైతులు మోటార్ ఇంజన్లతో గట్టు పైన నీళ్లు వదలడంతో గట్టు కొట్టుకుపోయి పటిష్టత పోతుందని, కాలువ పరిధిలో చెట్లను గుర్తు తెలియని వ్యక్తులు నరికేస్తున్నారని పలువురు రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. ఆదివారం గ్రామస్తులు, రైతులు మాట్లాడుతూ మండలంలోని దొండపూడి పంచాయతీ పరిధిలోని సాగిపాడు శివారులో గల లెప్రసీ కాలనీ సమీపంలో 2.8 కిలోమీటర్ వద్ద గల కొవ్వాడ కాలువ నుంచి రైతు మోటార్ ఇంజన్ ఏర్పాటు చేశారు. దానితో నీటిని తోడుతూ గట్టు పైనే నీరు వదలడంతో గట్టు కొట్టుకుపోవడంతో పాటు, గాడులు పడి పటిష్టత కోల్పోతుందన్నారు. అదేవిధంగా ఈ కాలువ గట్లపై ఉన్న భారీ చెట్లు గుర్తు తెలియని దుండగులు బహిరంగంగానే కొట్టుకుపోతున్నప్పటికీ అధికారులు చూసి చూడనట్టు వ్యవహరిస్తున్నారని ఆరోపించారు. ఇప్పటికైనా సంబంధిత ఇరిగేషన్ అధికారులు వెంటనే వారిపై చర్యలు తీసుకోవాలని కాలువ చెట్లను, గట్లను పరిరక్షించాలని వారు కోరారు.

కార్టూ'నిజం'



వలస పక్షుల జీవనం ఛిద్రం

పొట్టకూటి కోసం పాకులాట
ప్రాంతంగాని ప్రాంతంలో ఉపాధి పోరాటం

ప్రజాశక్తి - రాజానగరం

వలస పక్షుల జీవనం ఛిద్రంగా మారుతోంది. పొట్ట చేతబట్టుకుని ఉపాధి కోసం నగరాలకు వస్తున్న వారి సంఖ్య రోజురోజుకూ పెరుగుతోంది. ఇతర రాష్ట్రాల నుంచి వచ్చి ఇక్కడ బతుకు పోరాటం చేస్తున్నారు. కనీసం ఉండటానికి గూడు కూడా లేక ఊరికి శివారు డేరాలు వేసుకుంటూ జీవిస్తూ... చిరు వ్యాపారాలు చేసుకుంటూ జీవనం సాగిస్తున్నారు. వారికి ఎలాంటి ప్రభుత్వ పథకాలు గాని, కనీసం రేషన్ బియ్యం కూడా అందని పరిస్థితి. వారి పిల్లలు విద్యకు దూరంగా మసకబారుతున్న బాల్యంలోనే రోజులను వెళ్లదీస్తున్నారు.

రాజానగరంలో వివిధ రాష్ట్రాలకు చెందిన వలస కార్మికులు వచ్చి ఇక్కడ చిరువ్యాపారలు చేసుకుంటూ జీవనం సాగిస్తున్నారు. రాజస్థాన్ రాష్ట్రం జోగ్‌పూర్‌కు చెందిన సీతాదేవీ, గుజరాత్ రాష్ట్రం అహ్మదాబాద్‌కు చెందిన లాహోర్‌కుమలర్ణి, మహారాష్ట్ర నాగపూర్‌కు చెందిన దేవయానీ రాథోడ్ తదితర కుటుంబాలు ఇక్కడకు వలస వచ్చాయి. ప్లాస్టిక్ పువ్వులు తయారు చేసి అమ్ముకుంటూ వారు జీవనం సాగిస్తున్నారు. ఆయా రాష్ట్రాల్లో జీవనోపాధి లేక ఇలా వచ్చేశామని వారు చెబుతున్నారు. ముడి సరుకులను సొంత రాష్ట్రాల నుంచి తీసుకుని వచ్చి ఇక్కడ తయారు చేసుకుని అమ్మకుంటున్నామని తెలిపారు. అమ్మిన డబ్బులుతోనే కుటుంబ పోషణ ఉంటుందని తెలిపారు. ఏడాదిలో హోళీ రోజున వారు సొంత రాష్ట్రాలకు వెళ్తారు. మిగిలిన సమయాల్లో తెలంగాణ, ఆంధ్రప్రదేశ్, ఒడిశా తదితర రాష్ట్రాలకు వలస వస్తామని చెబుతున్నారు. తమకు ప్రభుత్వాలు ఎలాంటి వసతులు గాని, సాయం గాని అందించట్లేదని తెలిపారు.

చదువులకు దూరం

వలస కార్మికుల పిల్లలు విద్యకు దూరమవుతున్నారు. వీరికి ఎలాంటి విద్యా హక్కు చట్టం అమలు కావట్లేదు. పెద్దలు ప్లాస్టిక్ పూల తయారీ, అమ్మకాలకు వెళ్లిపోతుండగా చిన్నారులు డేరాల వద్దే అపరిశుభ్రమైన ప్రాంతంలోనే ఆడుకుంటున్నారు. పూర్తిగా నిరక్ష్యరాసులుగానే మిగిలి పోతున్నారు. కనీసం వీరికి పౌష్టికాహారం కూడా దొరకని పరిస్థితి. బడిబయట పిల్లలను బడిలోనే ఉంచాలని చట్టాలు చెబుతున్నా... వీరికి మాత్రం అది అమలు కావట్లేదు.



ప్లాస్టిక్ పూలు తయారు చేస్తూ...

గుజరాత్ నుంచి వచ్చాను



మాది గుజరాత్. అక్కడ ఉపాధి దొరక్కపోవడంతో ఇక్కడికి వచ్చారు. ప్లాస్టిక్ పూలు అమ్ముకుంటా కుటుంబాన్ని పోషిస్తున్నాను. మాకు ఎవరూ ఎలాంటి సాయం అందించట్లేదు.

- లాహోర్ కులకర్ణి, గుజరాత్

ప్లాస్టిక్ పూలు అమ్ముకుంటూ...



మాది మహారాష్ట్ర. ఉపాధి లేక కుటుంబంతో సహ వచ్చాను. ప్లాస్టిక్ పూలు అమ్ముకుంటూ జీవిస్తున్నాం. హోళీ పండుగకు మాత్రమే మా రాష్ట్రానికి వెళ్తాం. మళ్లీ ముడిసరుకు తెచ్చుకుని మళ్లీ ఇక్కడికి వచ్చేస్తాం.

- దేవీలాల్ రాథోడ్, మహారాష్ట్ర

నేరాలు ఘోరాలు



అధికారులుస్వాధీనం చేసుకున్న పిడిఎస్ బియ్యం

రేషన్ బియ్యం స్వాధీనం

ప్రజాశక్తి-రామచంద్రపురం

కె.గంగవరం మండలంలోని సత్యవాడ-నరజాడ రోడ్డులో వద్ద అక్రమంగా తరలిస్తున్న రేషన్ బియ్యాన్ని అధికారులు శనివారం రాత్రి స్వాధీనం చేసుకున్నారు. అశోక్ లేలాండ్ దోస్త్ వాహనం లో పిడిఎస్ బియ్యం తరలిస్తారన్న సమాచారంతో విజిలెన్స్, రెవెన్యూ. సివిల్ సప్లయి అధికారులు తనిఖీ చేశారు. వాహనంలో వివిధ రంగుల 43 ప్లాస్టిక్ బస్తాల్లో సుమారు 20 క్వింటాళ్ల పిడిఎస్ బియ్యాన్ని గుర్తించారు. పిడిఎస్ బియ్యాన్ని ఎటువంటి బిల్లులు లేకుండా కె. గంగవరం మండలం సత్యవాడ గ్రామమ నుంచి యానాం ప్రాంతానికి డ్రైవర్ చవ్వాకుల వెంకటేశ్వరరావు తరలిస్తున్నట్లు గుర్తించారు. వీటి విలువ రూ.6,80,000లు ఉంటుందని అంచనా. మొత్తం 20.00 క్వింటాళ్ల రేషన్ బియ్యం సివిల్ సప్లయ్స్ అధికారులు సీజ్ చేసి 6-ఎ కింద కేసు, తరలిస్తున్న వారిపై క్రిమినల్ కేసు నమోదు చేశారు. ఈ తనిఖీల్లో కార్యాలయ ఇనెస్పెక్టర్లు రమేష్, తహశీల్దార్ విజయకుమార్, హెడ్ కానిస్టేబుల్ జీవానందం, కానిస్టేబుల్ ఈశ్వర్, రెవెన్యూ, సివిల్ సప్లయిస్ అధికారులు పాల్గొన్నారు.



బోల్తా పడిన ఇసుక ట్రాక్టర్

ఇటుక ట్రాక్టర్ బోల్తా.. వ్యక్తి మృతి

ప్రజాశక్తి-రామచంద్రపురం

ఏటిగట్టుపై వెళుతున్న ఇటుక ట్రాక్టర్ ఆదివారం అదుపుతప్పి బోల్తా పడింది. ఈ ఘటనలో వ్యక్తి మృతి చెందాడు. వివరాలు ఇవి. కోటిపల్లి ఏటిగట్టు నుంచి వెళుతున్న ట్రాక్టర్ నీలగిరి పేట వద్ద గేదేను తప్పించబోయి అదుపుతప్పి బోల్తా పడింది. అందులో ఉన్న నీలా నాగేశ్వర రావు (52) మతి చెందాడు. దీనిపై కె.గంగవరం పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.



ప్రమాదంలో మృతి చెందిన వ్యక్తి

బస్సు ఢీ కొని వ్యక్తి దుర్మరణం

ప్రజాశక్తి- రామచంద్రపురం

రామచంద్రపురం ఆర్టీసీ కాంప్లెక్స్ అవుట్ గేట్ లో ఆర్టీసీ బస్ ఢీ కొని వ్యక్తి ఆదివారం దుర్మరణం పాలయ్యాడు. పట్టణానికి చెందిన టేకుమూడి సత్యనారాయణ (50) మోటార్ సైకిల్ పై చోడవరం వైపు వెళుతుండగా కాంప్లెక్స్ వద్దకు వచ్చేసరికి బస్సు ఢీ కొంది దీంతో మోటార్ సైకిల్ నడుపుతున్న సత్యనారాయణ అక్కడకక్కడే మతి చెందాడు.రామచంద్రపురం పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

అగ్ని ప్రమాదంలో గాయపడిన మహిళ మృతి

ప్రజాశక్తి -రామచంద్రపురం

అగ్ని ప్రమాదానికి గురైన మహిళచికిత్స పొందుతూ మృతి చెందింది. మండలం లోని శివల గ్రామానికి చెందిన నిడదవోలు లక్ష్మీ భ్రమరాంబ ఇటీవల నీళ్లు కాస్తూ అగ్ని ప్రమాదానికి గురైంది. ఆమె కాకినాడ ప్రభు త్వ ఆసుపత్రిలో చికిత్స పొందుతూ శనివారం రాత్రి మృతి చెందినట్లు పోలీసులు తెలిపారు. దీనిపై కేసు నమోదు చేసి ఎస్ఐ చిరంజీవి దర్యాప్తు చేస్తున్నారు.

మద్యానికి డబ్బులివ్వలేదని యువకుని ఆత్మహత్య

ప్రజాశక్తి - సీతానగరం

భార్య మద్యానికి డబ్బులివ్వలేదని పురుగు మందు తాగి యువకుడు ఆత్మహత్య చేసుకున్న సంఘటన శనివారం రాత్రి చోటు చేసుకుంది. మునికూడలి గ్రామానికి చెందిన గెడ్డం యేసు (23) మద్యానికి బానిసై సంవత్సరం నుంచి పనికి వెళ్లకుండా ఇంటివద్ద ఉంటున్నాడు. శనివారం మద్యం తాగడం కోసం భార్య డబ్బులు ఇవ్వడం లేదని చుట్టు పక్కల పొలాల్లో రైతులు దాచుకున్న పురుగుల మందు తాగి ఇంటికెళ్లాటు. వాంతులు కావడంతో భార్యతో పురుగులు మందు తాగినట్లు చెప్పాడు. కుటుంబ సభ్యులు వైద్యం నిమిత్తం రాజమండ్రి ప్రభుతాసుపత్రికి తరలించగా చికిత్స పొందుతూ అర్ధరాత్రి 12 గంటలు దాటిన తరువాత మృతి చెందాడు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

ప్రతిష్టాత్మకంగా ఆరోగ్యశ్రీ అమలు

ఆరోగ్యశ్రీ కో-ఆర్డినేటర్ రాధాకృష్ణ





ప్రజాశక్తి-కాకినాడ ప్రతినిధి

రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న డాక్టర్ వైఎస్సార్ ఆరోగ్యశ్రీ పథకాన్ని జిల్లాలో అర్హులందరికీ సక్రమంగా అమలయ్యేలా చర్యలు తీసుకుంటామని ఆరోగ్యశ్రీ జిల్లా కో ఆర్డినేటర్ పసుపులేటి రాధాకష్ణ అన్నారు. ఈ పథకం కింద జిల్లాలో నిర్వహించిన నవశకం సర్వేలో 16,13,000 మంది లబ్ధిదారులను గుర్తించామన్నారు. వీరిలో మొదటి విడతలో 5,882 ఆరోగ్య శ్రీ కార్డులు పంపిణీ చేశామన్నారు. జనవరి 3వ తేదీ నుంచి ఆరోగ్యశ్రీ కార్డుల పంపిణీ కార్యక్రమాన్ని చేపట్టామన్నారు. గతంలో 1,059 జబ్బుల నుంచి 1,259 రోగాలకు వైద్యసేవలు అందించనున్నామన్నారు. జనవరి 3 తేదీ నుంచి పెంచిన జబ్బులకు ఆరోగ్యశ్రీ వర్తిస్తుందని వివరించారు. ఈ సందర్భంగా ఆయన ప్రజాశక్తికి ఇచ్చిన ఇంటర్వ్యూలో మాట్లాడారు.

ఆరోగ్యశ్రీకి కొత్తగా చేర్చిన ముఖ్యమైన సేవలు ఏమిటి.

జనరల్ మెడిసిన్, జనరల్ సర్జరీ, కంటికి, చెవికి, ముక్కు, గొంతుక, పీడియాట్రిక్, జెనిటో న్యూరో, సర్జికల్, అంకాలజీ, మెడికల్ అంకాలజీకి సంబంధించిన జబ్బులను ఆరోగ్యశ్రీలో కొత్తగా చేర్చారు.

పాత కార్డులు కూడా చెల్లుతాయా.

ప్రభుత్వం కొత్త కార్డులను జారీ చేస్తోంది. కొత్త కార్డులు ఇచ్చే వరకూ పాత కార్డులు చెల్లుబాటులో ఉంటాయి. అర్హులైన ప్రతి ఒక్కరికీ ఆరోగ్యశ్రీ కార్డులు అందుతాయి. నవశకం సర్వే ఆధారంగా లబ్ధిదారులను గుర్తించాము. అర్హుల జాబితా ఇప్పటికే గ్రామ,వార్డు సచివాలయాల్లో ప్రకటించారు.

ఇతర ఏయే రాష్ట్రాల్లో ఆరోగ్యశ్రీని విస్తరించారు.

ఆరోగ్యశ్రీ కార్డు ఉంటే చాలు ఇక మన రాష్ట్రంతో బాటు, ఇతర రాష్ట్రల్లో కూడా వైద్య సేవలు పొందవచ్చు. కర్నాటక, తమిళనాడు తెలంగాణా వంటి రాష్ట్రాలతో కలిపి 135 కార్పొరేట్ ఆసుపత్రుల్లో ఉచిత వైద్యం పొందవచ్చు. ఇతర రాష్ట్రాల్లో 130 కార్పొరేట్ ఆస్పత్రుల్లో ఆరోగ్యశ్రీ వర్తిస్తుంది. జిల్లాలో 85 ప్రభుత్వాసుపత్రులు, 86 ప్రైవేట్ ఆసుపత్రుల్లో ఆరోగ్యశ్రీ పథకం కింద వైద్య సేవలు పొందవచ్చు.

మొత్తం ఎన్ని శస్త్రచికిత్సలు చేశారు..

ఇప్పటివరకు జిల్లాలో మొత్తం 4,91,833 ఆరోగ్యశ్రీ శస్త్రచికిత్సలు చేశారు. వీటికి ప్రభుత్వం నుంచి రూ.1,280.26 కోట్లు ఖర్చు చేశారు. జిల్లాలో ఇప్పటివరకు 3,429 హెల్త్ క్యాంపులు నిర్వహించారు. వీటిద్వారా 6,62,578 మంది ఉచితంగా వైద్య పరీక్షలు చేయించుకున్నారు. 16,838 మందిని ఆరోగ్యశ్రీ ఆసుపత్రులకు రెఫర్ చేశారు

వైయస్సార్ ఆసరా ప్రయోజనాలేమిటి..

డాక్టర్ వైఎస్ఆర్ ఆరోగ్యశ్రీ పథకం శస్త్ర చికిత్సలు చేకున్న వారికి వైఎస్ఆర్ ఆసరా క్రింత పోషణ ఖర్చుల కోసం రూ.225 నుంచి రూ.5 వేల వరకు ఆర్థిక సాయం ప్రభుత్వం నేరుగా లబ్దిదారుల బ్యాంకు ఖాతాల్లో జమ చేయనుంది. ఆరోగ్యశ్రీ పథకంలో రోగులకు డాక్టర్ల వైద్య పరీక్షలు, వ్యాధి నిర్ధారణ పరీక్షలు (రక్తపరీక్షలు) శస్త్ర చికిత్సలు, ఉచితంగా మందులు పంపిణీ, ఉచిత భోజనం, వసతి, ఆసుపత్రులు రానుపోను రవాణా ఖర్చులు ఇవ్వనున్నారు.

తాళ్లరేవులో ఎన్నికల కోడ్ అమలు

ప్రజాశక్తి - తాళ్లరేవు

ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లాలో ఎంఎల్‌సి ఎన్నికల సందర్భంగా అధికారులు ఎన్నికల కోడ్ అమలు చేస్తున్నారు. ఈ సందర్భంగా పలు రాజకీయ నాయకుల విగ్రహాలకు ముసుగులు వేయడంతో పాటు మండలంలోని పలు ప్రాంతాల్లో ఫ్లెక్సీలు తొలగిస్తున్నారు. ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లా నుంచి స్థానిక సంస్థల కోటాలో శాసనమండలికి ఎన్నికైన చిక్కాల రామచంద్రరావు పదవీకాలం ఈ ఏడాది మే1తో ముగియనుంది. ఈ స్థానంలో ఎన్నిక కోసం గురువారం నోటిఫికేషన్ జారీ చేసిన సంగతి విదితమే. దీంతో ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లాలో ఈ నెల 9వ తేదీ నుంచి ఎన్నికల ప్రవర్తన నియమావళి అమల్లోకి వచ్చింది. ఫిబ్రవరి 16న నోటిఫికేషన్ జారీ అవుతుంది. ఈనెల 23 వరకు నామినేషన్లు స్వీకరించినున్నారు. 24న నామినేషన్ల స్క్రూటినీ జరుగుతుంది. 27 వరకు నామినేషన్ల ఉపసంహారణకు గడువుగా పేర్కొన్నారు. మార్చి 13వ తేదీ ఉదయం 8 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు పోలింగ్ జరుగుతుంది. మార్చి 16న ఎన్నికల ఓట్ల కౌంటింగ్ జరుగుతుంది. మార్చి 21తో ఎన్నికల నోటిఫికేషన్ పూర్తవుతుంది .అప్పటివరకు ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో ఎన్నికల కోడ్ అమల్లో ఉంటుంది.

వైద్యశిబిరం నిర్వహణ అభినందనీయం

ప్రజాశక్తి - కడియం

పుట్టిన రోజును పురస్కరించుకుని కుటుంబ సభ్యులు, బంధుమిత్రుల మధ్య అట్టహాసంగా నిర్వహించుకోకుండా ఉచిత వైద్య శిబిరం ద్వారా ప్రజలకు వైద్య సేవలు అందించడం అభినందనీయమని ఎంపీ మార్గాని భరత్‌రామ్ అన్నారు. ఆదివారం వేమగిరిలో వైసిపి రాష్ట్ర కార్యదర్శి రావిపాటి రామచంద్రరావు పుట్టినరోజు సందర్భంగా ఉచిత మెగా వైద్య శిబిరాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఎంపీ ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. తొలుత రావిపాటి రామచంద్రరావుకు జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం వైద్య శిబిరాన్ని ప్రారంభించారు. కిమ్స్, బొల్లినేని వైద్యులు, అకిరా నేత్ర వైద్యులు ఈ వైద్య శిబిరంలో ప్రజలకు వివిధ రకాల వైద్య సేవలు అందించారు. వైద్యపరీక్షలను నిర్వహించామని శస్త్రచికత్సలు అవసరమైన వారికి తమ ఉచితంగ చేస్తామని వైద్యులు తెలిపారు. ఈ కార్యక్రమంలో వైసిపి మండల అధ్యక్షులు వై.స్టాలిన్, భీమిరెడ్డి నాగేంద్ర, ఈలి గోపాలం పాల్గొన్నారు.

పూర్వ విద్యార్థుల కలయిక

ప్రజాశక్తి - పెద్దాపురం

పెద్దాపురం లూథరన్ హైస్కూల్లో 1982లో 10వ తరగతి చదివిన పూర్వ విద్యార్థులు 41 సంవత్సరాల అనంతరం ఆదివారం లూథరన్ హైస్కూల్లో కలుసు కున్నారు. తమ విద్యార్థి దశలో జ్ఞాపకాలను నెమరు వేసుకున్నారు. ఈ సందర్భంగా ఉపాధ్యా యులను సన్మానించారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ ఎక్కడెక్కడో స్థిరపడిపోయిన తాము 40 ఏళ్ల క్రితం తాము చదువుకున్న స్కూల్లో కలుసుకోవటం చాలా ఆనందంగా ఉందన్నారు. ఈ కార్యక్రమంలో పూర్వ విద్యార్థులు కట్టా వెంకటరావు, తిప్పాని శ్రీనివాస్, శంకర్, పైడిపల్లి సూర్యనారాయణ మూర్తి, వేదుల సుబ్రహ్మణ్యం (మణి), రియాజ్ పాషా పాల్గొన్నారు.



సమావేశమైన పూర్వ విద్యార్థులు

హైవేను గ్రామం వెలుపలకు మళ్లించాలి

ప్రజాశక్తి - గోపాలపురం

జీలుగుమిల్లి నుంచి కొవ్వూరు వెళ్లే నేషనల్ హైవేను దొండపూడి గ్రామం బయట నుంచి మళ్లించాలని ఆ గ్రామానికి చెందిన వైసిపి మండల అధ్యక్షులు పోతిరెడ్డి నాగరాజు, గ్రామ కమిటీ అధ్యక్షులు పోల్నాటి సురేష్, గ్రామ పెద్దలు ఎంపీ మార్గాన్ని భరత్, ఎంఎల్ఎ తలారి వెంకట్రావులకు వినతిపత్రాలు అందించారు. ఎంపీ, ఎంఎల్ఎలను వారు ఆదివారం కలిశారు. వారు మాట్లాడుతూ జీలుగుమిల్లి నుంచి కొవ్వూరు వెళ్లే నేషనల్ హైవే రోడ్డు మండలంలోని దొండపూడి గ్రామం శివారు సాగిపాడు నుంచి దొండపూడి శివారు వరకు సుమారు రెండు కిలోమీటర్ల మేర వెళ్లనుందన్నారు. ఈ రహదారిని గ్రామంలో నుంచి వేస్తున్నారన్నారు. దీని వల్ల దొండపూడి గ్రామంలో చాలామంది నివాసాలను కోల్పోతారన్నారు. దీన్ని దృష్టిలో పెట్టుకుని దొండపూడి గ్రామం దాటే వరకు సుమారు రెండు కిలోమీటర్లు బైపాస్ రోడ్డు వేయాలని కోరినట్లు తెలిపారు.

ఆయిల్ ఫ్యాక్టరీ యాజమాన్యానికి రిమాండ్

ప్రజాశక్తి-సామర్లకోట

జి.రాగంపేట అంబటి సుబ్బన్న అండ్ కో ఆయిల్స్‌లో ఏడుగురు కార్మికుల మరణం ఘటనలో ముగ్గురు నిందితులను ఆదివారం పెద్దాపురం అడిషనల్ జ్యుడీషియల్ ఫస్ట్ క్లాస్ మేజిస్ట్రేట్ ముందు హాజరు పరిచారు. వారికి ఆయన 14 రోజుల రిమాండ్ విధించారు. వారిని పెద్దాపురం సబ్ జైలుకు తరలించినట్లు పెద్దాపురం పోలీసులు తెలిపారు.

16న పెద్దాపురంలో చంద్రబాబు పర్యటన


ప్రజాశక్తి - పెద్దాపురం

టిడిపి జాతీయ అధ్యక్షులు చంద్రబాబు నాయుడు తూర్పుగోదావరి జిల్లా పర్యటనలో భాగంగా 16న పెద్దాపురం నియోజకవర్గ పరిధిలోని జె.తిమ్మాపురం గ్రామంలో ప్రవేశిస్తారని ఎంఎల్ఎ నిమ్మకాయల చినరాజప్ప తెలిపారు. జె.తిమ్మాపురంలో నియోజకవర్గ పరిధిలోని నాయకులు కార్యకర్తలు ఆయనకు భారీ స్వాగతం పలుకుతారన్నారు. పర్యటనలో భాగంగా కట్టమూరు సెంటర్‌కు చేరుకుంటారని, అక్కడ కట్టమూరు గ్రామ టిడిపి నాయకులు, కార్యకర్తలు స్వాగతం పలుకుతారన్నారు. సాయంత్రం 5 గంటలకు పెద్దాపురం కొత్తపేట ఎన్టీఆర్ సర్కిల్ వద్ద పట్టణ నాయకులు, కార్యకర్తలు స్వాగతం పలుకుతారన్నారు. అనంతరం దర్గా సెంటర్, వెంకటేశ్వర స్వామి గుడి సెంటర్, మెయిన్ రోడ్డు మీదుగా సామర్లకోట చేరుకుంటారన్నారు.

స్కూల్ గేమ్స్ పోటీల్లో సునయన సత్తా

ప్రజాశక్తి-కాకినాడ

రాష్ట్ర స్థాయి ఈత పోటీల్లో రాణించి జాతీయ స్థాయి పోటీలకు ఎంపికైన కాకినాడ విద్యార్థిని పిఎస్ఆర్ఎస్.దీప్తి సునయన మరోసారి సత్తా చాటింది. స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా (ఎస్‌జిఎఫ్ఐ) ఆధ్వర్యంలో జరిగిన పోటీల్లో పతకం సాధించింది. అండర్ 17 బాలికల 400 మీటర్ల ఫ్రీ స్టైల్ ఈత పోటీల్లో కాంస్య పతకం గెలిచింది. 100 మీటర్ల విభాగంలోనూ తృతీయ స్థానంలో నిలిచి, పతకం సాధించింది. కష్ణా జిల్లా ఈడ్పుగల్లులో జరిగిన పోటీల్లో సునయన విజయం సాధించడం జిల్లాకు గర్వకారణమని డైవ్ ఇన్ స్విమ్ కోచ్ అశోక్ అన్నారు. సెయింట్ జోసెఫ్ స్కూల్లో పదో తరగతి చదువుతున్న ఆమె విజయం సాధిస్తుండడం ఆనందంగా ఉందని తల్లిదండ్రులు శివ ప్రసాద్ వర్మ, అర్చన సంతోషం వ్యక్తం చేశారు.



బషీర్ బీబీని దర్శించుకున్న ఎస్‌పి

బషీర్ బీబీని దర్శించుకున్న ఎస్‌పి

ప్రజాశక్తి -యు.కొత్తపల్లి

పొన్నాడ గ్రామంలో ఉన్న బషీర్ బేబీ ఆలయాన్ని కాకినాడ జిల్లా ఎస్‌పి రవీంద్రబాబు దర్శించుకున్నారు. ఆదివారం చివర రోజు కావడంతో ఎస్‌పి స్వయంగా భద్రతా ఏర్పాట్లను పరిశీలించారు. బీబీని సందర్శించేందుకు రాష్ట్రం నుండే కాకుండా ఇతర రాష్ట్రాల నుండి అనేకమంది మతాలకు అతీతంగా హాజరవుతారు. ఎస్‌పి వెంట పిఠాపురం సిఐ శ్రీనివాసరావు, కొత్తపల్లి ఎస్సై రామలింగేశ్వరరావు పలువురు ఎస్సైలు సిబ్బంది పాల్గొన్నారు.



చిన్నారులకు కిట్లు అందజేస్తున్న సర్పంచ్ శ్రీ దుర్గ, వెంకన్న నాయుడు

చిన్నారులకు పౌష్టికాహారం పంపిణీ

ప్రజాశక్తి-ఉప్పలగుప్తం


గొల్లవిల్లిలో హెచ్ఐవి బాధిత చిన్నారులకు ఆదివారం పౌష్టికాహార కిట్లను పంపిణీ చేశారు. జన కల్యాణ్ వెల్ఫేర్ సొసైటి ఆధ్వర్యంలో డాక్టర్ బిఆర్.అంబేద్కర్ కోనసీమ జిల్లా వికలాంగుల సంక్షేమ సంఘం అధ్యక్షులు, వైసిపి నాయకులు వంటెద్దు వెంకయ్య నాయుడు, కె.రిష్విక్, కె. ప్రసన్న, జి.చంద్రశేఖర్, జల్లి సుజాత, కె.ధీరజ్‌ల సహకారంతో ఈ కిట్లు అందజేశారు. ముందుగా చిన్నారులతో కేక్ కటింగ్ చేయించి వారిలో మనో ధైర్యం నింపారు. సర్పంచ్ జొన్నాడ శ్రీదుర్గ, నాయకులు మద్దింశెట్టి సీతారామస్వామి, సలాది శివాజీ, సలాది పట్టాభి, దూలం శ్రీనివాసరావు, సుంకర బుజ్జి, చప్పిడి దుర్గారావు, పోలిశెట్టి వీరబాబు, నందుల ఏసుబాబు, సలాది రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

పేకాట స్థావరాలపై పోలీసుల దాడి

ప్రజాశక్తి -యంత్రాగం

పలుచోట్ల ఆదివారం పేకాట శిబిరాలపై పోలీసులు దాడులు నిర్వహించారు. నగదును స్వాధీనం చేసుకుని పలువురిని అరెస్ట్‌చేశారు. వివరాలు ఇవి..

మండపేటమండలంలోని ద్వారపూడి శివారు వేములపల్లిలోని పేకాట శిబిరంపై రూరల్ పోలీసులు ఆదివారం దాడి చేశారు. పేకాడుతున్న నలుగురు వ్యక్తులను అదుపులోనికి తీసుకొని వారి వద్ద నుంచి రూ.1,32,700 స్వాధీనం చేసుకున్నట్లు ఎస్ఐ బి.శివకష్ణ తెలిపారు. **సామర్లకోట** స్థానిక సంపంగి తోటలోని పేకాట నిర్వహిస్తున్నారన్న సమాచారంతో ఆదివారం సామర్లకోట సిఐ కె.దుర్గాప్రసాద్ ఆధ్వర్యంలో దాడులు నిర్వహించారు. అరెస్టు చేసి వారి వద్ద నుంచి రూ.6,360 నగదును స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసినట్లు సిఐ కె.దుర్గాప్రసాద్ తెలిపారు.



ఆర్థిక సాయం అందజేస్తున్న జనసేన నాయకులు

మృతుని కుటుంబానికి ఆర్థిక సాయం

ప్రజాశక్తి -ఉప్పలగుప్తం

ఇటీవల కూనవరానికి చెందిన జనసేన పార్టీ క్రియాశీల కార్యకర్త కొప్పిశెట్టి రామస్వామి ప్రమాదవశాత్తు మృతి చెందాడు. ఆ కుటుంబానికి ఆదివారం జనసేన పార్టీ రూ.20 వేల ఆర్థిక సాయం అందించింది. అలాగే గోపవరం కు చెందిన నాగాబత్తుల ప్రసాద్ కిడ్నీ వ్యాధితో బాధపడుతుండగా ఆ కుటుంబానికి రూ.15 వేలు ఆర్థిక సాయం అందించారు. కార్యక్రమంలో జనసేన పార్టీ నాయకులు ఇసుకపట్ల రఘుబాబు, అయితాబత్తుల ఉమామహేశ్వరరావు, ఉండ్రు భగవాన్ దాస్,ఆకుల సూర్యనారాయణ మూర్తి, లింగోలు పండు,సాకా రాంబాబు, అయితాబాత్తుల కష్ణారావు, కొప్పుల నాగమానస, బసవా చినబాబు, గాలి నారాయుడ ు,తిక్కా శేషుబాబు, వాకపల్లి వెంకటేశ్వర రావు, ఆకుల శ్రీనివాసరావు,బండారు వెంకన్నబాబు, తదితరులు పాల్గొన్నారు.

డంపింగ్ యార్డులుగా రహదారులు, కాలువగట్లు

దుర్వాసనతో ఇబ్బందులు పడుతున్న ప్రజలు

ప్రజాశక్తి -మండపేట



బైపాస్ రోడ్డులో పేరుకు పోయిన చెత్తా చెదారం

మండపేట పట్టణ, గ్రామీణ ప్రాంతాల్లో స్వచ్ఛభారత్, స్వచ్ఛ సర్వేక్షణ్, మనం-మన పరిశుభ్రత, వ్యర్థాలపై వ్యతిరేక పోరాటంతోపాటు పారిశుధ్యంపై అవగాహన వంటి ఎన్నో కార్యక్రమాలు నిర్వహిస్తున్నా మెరుగుపడటం లేదు. సమస్య నానాటికీ తీవ్ర రూపం దాలుస్తోంది. ఆహ్లాదకంగా ఉండాల్సిన రహదారులు, కాలువ గట్లు డంపింగ్‌యార్డులుగా మారి దుర్గంధం వెదజల్లుతున్నాయి. దీంతో తాము వ్యాధులబారిన పడుతున్నామని స్థానికులు, ప్రయాణీకులు వాపోతున్నారు. ఇవి కుక్కలకు, పందులకు, దోమలు, క్రిమికీటకాలకు ఆవాసాలుగా మారుతుండటంతో రాత్రి సమయాల్లో దోమలు కంటి మీద కునుకు లేకుండా చేస్తున్నారు. స్థానిక బైపాస్, ఇందిరాగాంధీ రోడ్డులతో పాటు మండలంలోని వెలగతోడు, తాపేశ్వరం, అర్తమూరు తదితర గ్రామాల్లో రోడ్ల, కాలువల వెంబడి ఉన్న చెత్తాచెదారాలతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులెదుర్కొంటున్నారు. స్థానిక పెద్ద కాలువ వంతెన సమీపంలోను రహదారి వెంబడి చెత్తను వేయడంతోపాటు ఆ చెత్తకు నిప్పు పెడుతుండటంతో ఆ రోడ్లపై ప్రయాణించే వారు తీవ్ర అవస్థలు పడుతున్నారు. ప్రభుత్వాలు, పాలకులు, అధికారులు మారుతున్నా సమస్యల పరిష్కారానికి నోచుకోవడంలేదని పలువురు విమర్శిస్తున్నారు. మూతపడ్డ చెత్త నుంచి సంపద తయారీ కేంద్రాలను తెరిచి, చెత్తను అక్కడికి తరలించాలని కోరుతున్నారు. పచ్చదనం, పరిశుభ్రతను కాపాడే విధంగా అధికారులు సత్వరమే చర్యలు చేపట్టాలని విజ్ఞప్తి చేస్తున్నారు.



పెద్ద కాలువ వంతెన సమీపంలో చెత్త



రాజరత్న రోడ్డులో పేరుకుపోయిన చెత్త



కార్యక్రమం లో పాల్గొన్న టిడిపినాయకులు

కాకరపర్రులో 'ఇదేం ఖర్మ మన రాష్ట్రానికి'

ప్రజాశక్తి - పెరవలి

పెరవలి మండలంలోని కాకరపర్రులో టిడిపి నియోజకవర్గ ఇన్‌ఛార్జి బూరుగుపల్లి శేషారావు ఆదేశాలతో ఆదివారం గ్రామంలో ఇదేం కర్మ మన రాష్ట్రానికి కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రతి ఇంటికీ తిరిగి జగన్ ప్రభుత్వం పేదలపై వేస్తున్న భారాలను వివరించారు. కరెంటు బిల్లులు, ఆర్‌టిసి ఛార్జీలు, నిత్యావసర వస్తువుల ధరలు, గ్యాస్ పెట్రోలు డీజిల్ వంట నూనె ధరలు విపరీతంగా పెంచి పేద ప్రజలపైభారం మోపారని చెప్పారు. అనంతరం నాయకులు ప్రజల సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో టిడిపి మండల అధ్యక్షులు అతికాల వెంకట రామకష్ణమ్మ, సంగీత జయరాజు, బొడ్డు రామాంజనేయులు, అబ్బిశెట్టి సత్తిరాజు, వాకలపూడి వీర్రాజు, సలాది కష్ణమూర్తి, గుడాల నాగ మురళీకృష్ణ, మాణికిరెడ్డి, మురళీకష్ణ, బూరుగుపల్లి, నారాయణరావు, అనపర్తి సత్యనారాయణ, అనపర్తి సాంబమూర్తి, కంటిపూడి సూర్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.